క్లుప్తంగా

వ్యాపారికి తోపుడు బండి అందజేత


కూరగాయల వ్యాపారికి తోపుడు బండి అందజేస్తున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: ప్రజాసేవ చేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు స్ఫూర్తి అని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. శనివారం స్థానిక 21వ వార్డు వెలమగూడేనికి చెందిన ఓ వృద్ధురాలికి తాతాజీ తోపుడు బండిని అందించారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ 60 ఏళ్ల వయస్సులో జొన్నపొత్తులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న పుండ్రోటు రమణమ్మ తనకు ఎవరూ లేరని జొన్నపొత్తులు అమ్ముకోవడానికి తోపుడు బండి కావాలని కోరింది. ఇప్పటి వరకూ అద్దె బండిపైనే వ్యాపారం చేసుకుంటున్నానని అద్దె చెల్లించలేకపోతున్నానని బండి కావాలని కోరిందన్నారు. చిరు వ్యాపారులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఆమెకు తోపుడు బండి అందించానన్నారు. కార్యక్రమంలో బెజ్జవరపు నాగరాజు, కొరగింజల శ్రీను, గంటా నరేష్, పాలపర్తి కృపానాథ్, పెచ్చెట్టి కృష్ణాజీ, కర్పూరం వెంకటేశ్వరరావు, త్సవటపల్లి కృష్ణమోహన్, రావి నాగేశ్వరరావు, కాపిశెట్టి శ్రీను, ఆకుల ప్రసాద్, అంజుర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి కొండాలమ్మ ఉత్సవాలు

పెనుగొండ: స్థానిక నగరేశ్వర స్వామి కాలనీలోని కొండాలమ్మ ఆలయం తృతీయ వార్షికోత్సవం ఈ నెల 8 నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కాళీపట్నం భూముల పరిశీలన


రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తున్న సీసీఎల్ఏ అపీల్స్ కమిషనర్ లక్ష్మీ నరసింహ

మొగల్తూరు: కాళీపట్నం భూములను సీసీఎల్ఏ అపీల్స్ కమిషనర్ లక్ష్మీ నరసింహ శనివారం పరిశీలించారు. కాళీపట్నం జమీందారి భూములపై రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో కాళీపట్నం రెవెన్యూ గ్రామాల ప్రజలు అనేక సార్లు ప్రభుత్వ దృష్టికి, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. గత పదిహేను సంవత్సరాలుగా క్రయవిక్రయాలు నిలిచిపోవడంతో ఆప్రాంత రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రభుత్వం ఇటీవల రీ సర్వే చేపట్టడంతో కాళీపట్నంలో పర్యటించి భూములను పరిశీలించడంతో పాటు రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ జి.అనిత కుమారి, డీటీ నరేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ గవర్నర్ పంకజాక్షన్

మొగల్తూరు: లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతంగా చేపట్టాలని డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వికే పంకజాక్షన్ సూచించారు. శనివారం మొగల్తూరులో లయన్స్ క్లబ్ సభ్యులు రాయుడు లక్ష్మణరావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పేదలకు బియ్యం, పళ్ళు దుప్పట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ కె రామలింగేశ్వరరావు, జోనల్ చైర్ పర్సన్ ఏ నళినీదేవి, మొగల్తూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు కడిమి సాంబమూర్తి, కార్యదర్శి డాక్టర్ చెరుకూరి శ్రీనివాస రాజు,సభ్యులు ఆకన ఫణి, కాసాని కృష్ణ, యు.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ఉండి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీకి చెందిన రాగోలు కృష్ణ శనివారం బైక్‌పై భీమవరం వెళ్లాడు. పనుల అనంతరం సాయంత్రం తిరిగి గ్రామానికి వస్తూ హైవే నుంచి గ్రామంలోకి మలుపు తిరుగుతుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో తీవ్రగాయాలపాలైన కృష్ణను స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ గీతాకృష్ణ, ఎస్సై కె.గంగాధరరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం వివరాలపై ఆరా తీశారు. అయితే ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు ఏమీ అందలేదని ఎస్సై తెలిపారు.

పదిలమైన వేళ ప్రత్యేక ప్రణాళిక

- గత ఫలితాల్లో చేదు అనుభవాలు
- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసుల నిర్వహణ
- ఈ ఏడాది 32 పాఠశాలల నుంచి 1885 మంది హాజరు

పాలకొల్లు అర్బన్: ప్రతి విద్యార్థికి పదో తరగతి కీలక ఘట్టం. ప్రతీ విద్యార్థి తన విద్యాభ్యాస జీవితంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్య పూర్తి చేసుకుని కళాశాల స్థాయికి చేరుకునే మజిలీ. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో పదో తరగతి పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసింది. నియోజకవర్గంలోని పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలం, యలమంచిలి, పోడూరు మండలాల్లోని 32 జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 1885 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. దీంతో ప్రతీ విద్యార్థి మంచి మార్కులు సాధించాలనే తపనతో పాఠాలను బట్టీ పడుతున్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేసుకుని, రివిజన్ క్లాసులు ప్రారంభించారు. దీంతో ప్రతీ పాఠశాలలోనూ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా మహమ్మారి కారణంగా విద్యార్థులు పూర్తి స్థాయిలో పాఠశాలకు రాలేదు. దీంతో విద్యా ప్రమాణాల్లో పూర్తిగా వెనుకబడ్డారు. ఈ కారణంగా గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది నూటికి నూరు శాతం ఉత్తీర్ణత కోసం ఉపాధ్యాయులు తాపత్రయపడుతున్నారు. ప్రతీ సబ్జెక్టుల్లోనూ విద్యార్థికి మంచి మార్కులు రావాలనే తపనతో విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించి ఆయా పాఠ్యాంశాల్లోని అనుమానాలను నివృత్తి చేస్తున్నారు.

సోషల్ మీడియాకు దూరంగా విద్యార్థులు...

విద్యార్థులు ఈ మూడు నెలలు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్ట్రాగామ్, ట్విట్టర్ తదితర సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పదో తరగతి విద్యార్థి చేతిలో పాఠ్య పుస్తకం ఉండాలే తప్ప సెల్‌ఫోన్ ముట్టుకోవద్దని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచిస్తున్నారు. అలాగే గత పరీక్షల్లో వచ్చిన ముఖ్యమైన ప్రశ్నలను గుర్తించి వాటిని చదివిస్తున్నారు. అలాగే ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ముద్రించిన సిలబస్‌ను ప్రతీ విద్యార్థికి అందజేసి వాటిని చదివిస్తున్నారు. మార్కులు ఎక్కువ సాధించడానికి ఉపయోగపడే విధి, విధానాలను ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు వివరిస్తున్నారు.


లంకలకోడేరులో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులు

మండలం	జెడ్పీ స్కూళ్లు	బాలురు	బాలికలు	మొత్తం
పాలకొల్లు	10	210	231	441
పాలకొల్లుపట్టణం	07	271	292	563
యలమంచిలి	11	303	302	605
పోడూరు	04	145	131	276
మొత్తం	32	929	956	1885

10/10 సాధించడమే లక్ష్యం...



నాది మామిడిగుంట. ప్రతీ రోజు 5 కిలో మీటర్లు సైకిల్ పై లంకలకోడేరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకుంటున్నా. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించిన పాఠాలపైనే ఆధారపడి చదువుతున్నా. ప్రైవేట్ తరగతులకు వెళ్లడం లేదు. పాఠశాల సమయం ముగిసిన తరువాత ఒక గంట ప్రత్యేకంగా చదివిస్తున్నారు. ప్రతీ పాఠ్యాంశంలోనూ 10/10 గ్రేడు సాధించడానికి పట్టుదలతో చదువుతున్నా.

– జి.ప్రవల్లిక, పదోతరగతి విద్యార్థిని, లంకలకోడేరు

ప్రత్యేక తరగతుల నిర్వహణ



ప్రతీ రోజు ఒక గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల పాఠ్యాంశంలో వచ్చిన అనుమానాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్నాం. మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో చదువుతున్నా. అన్ని సబ్జెక్టుల్లో ఏ గ్రేడు సాధించడానికి కృషి చేస్తున్నా. లంకలకోడేరు పాఠశాలకు ఉత్తీర్ణత విషయంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ గుర్తింపును నిలబెట్టాలని పట్టుదలతో చదువుతున్నాను.

– కె.చరణ్ తేజస్, పదోతరగతి విద్యార్థి, లంకలకోడేరు

మానసిక ఒత్తిడి లేకుండా అవగాహన



విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేకుండా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆలోచన చేస్తున్నాం. కొంతమంది విద్యార్థులు వారి ప్రవర్తన తీరు సరిగా లేదు. సోషల్ మీడియాకి బానిసలవుతున్నారు. దీని నుంచి విద్యార్థులను బయట పడే ప్రయత్నం చేస్తాం. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి, ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– ఏవీఎస్‌వీ ప్రసాద్, మండల విద్యాశాఖాధికారి, పాలకొల్లు

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏఎస్ఎన్ఎం విద్యార్థి

పాలకొల్లు సెంట్రల్: సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు కళాశాల నుంచి విద్యార్థిని ఎంపికైనట్లు అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి శనివారం తెలిపారు. పంజాబ్‌లో జరిగే ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్ బాల్ పోటీలకు ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ తరుపున బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని షేక్ జరీనా ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ ఎం.రామకృష్ణ, పీడీ జి.మహేష్ తదితరులు జరీనాను అభినందించారు.

దూర ప్రాంతాలకు వెళ్లి పింఛన్ల అందజేత


పెరవలి మండలం నల్లాకులవారిపాలెంలో పింఛన్ అందజేస్తున్న మహిళ పోలీస్ భాను

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామానికి చెందిన గాది జయలక్ష్మి ఇటీవల బిల్డింగ్ మెట్ల మీద నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడిపోవడంతో కాలి తుంటి భాగంలో విరిగింది. దీంతో ఆమె ఆపరేషన్ చేయించుకుని తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం నల్లాకులవారిపాలెంలో ఆమె కుమార్తె అడపా కల్యాణి ఇంటి వద్ద ఉంటుంది. మేడపాడు గ్రామ సచివాలయ మహిళ పోలీస్ భాను శనివారం నల్లాకులవారిపాలెం వెళ్లి ఆమెకు పింఛన్ అందజేసింది. ఈ సందర్భంగా జయలక్ష్మి ఆమె కుమార్తె కల్యాణిలు భానుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తణుకు వెళ్లి పింఛన్ అందజేత

పాలకొల్లు అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ల ప్రసాద్‌బాబు అనే వృద్ధుడికి పాలకొల్లు పట్టణం క్రిస్టియన్‌పేటకు చెందిన వలంటీర్ వి.వరుణ్ తణుకు వెళ్లి పింఛన్ అందజేశారు. గత రెండు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ తణుకులోని బంధువుల ఇంటి వద్ద ఉంటున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ వరుణ్ తన సొంత ఖర్చుతో మోటార్‌సైకిల్‌పై తణుకు వెళ్లి పింఛన్ అందజేశారు.

రామాలయ విగ్రహ పునః ప్రతిష్ట

పెనుగొండ: సిద్ధాంతం చింతల వారి పాలెంలో కోదండ రామాలయ విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభించారు. శనివారం హోతా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బొక్కా వెంకటేశులు చంద్రావతి, కొరు రవి(కిట్టయ్య)యశోధ దంపతులు విగ్రహాలకు క్షీరాదివాసం, జాలాధివాసం, పుష్పాదివాసం, లక్ష్మీ గణపతి హోమం, రుద్ర హోమంలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం9.05 గంటలకు విగ్రహ ప్రతిష్ట మహోత్సవం, పూర్ణాహుతి అనంతరం 11 గంటలకు భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గృహ సారథులు సమన్వయంతో పని చేయాలి


లంకలకోడేరులో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: గృహ సారథులు, వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పని చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామ సచివాలయంలో శనివారం వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి నెలా లబ్ధిదారులకు పింఛన్ అందించే ముందు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు తెలియజేసి వారి సమక్షంలో అందించాలన్నారు. అలాగే ఏదైనా కారణంగా పింఛన్ నిలిచిపోయినా, లేక ప్రభుత్వం అమలు చేసే ఏ పథకం నిలిచిపోయినా తక్షణం గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు మండల కన్వీనర్, మండల సచివాలయ కన్వీనర్ల ద్వారా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ నెల 8న మండలంలోని 5 గ్రామాలకు సంబంధించి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఆయా గ్రామాల వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసినట్లు శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్ణి జోగయ్య, పార్టీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, మండల సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, నాయకులు ఏనుగుపల్లి చంద్రశేఖర్, మడికి విక్రమ్, రావూరి చిన్న, రౌతు కృష్ణ, వీఆర్వో డి.నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వశాంతి కోసం గాయత్రీ మహాయజ్ఞం

యజ్ఞ,యాగాలు నిర్వహించడం వల్ల విశ్వమంతా సుభిక్షంగా ఉంటుందని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రు ఏఎస్ఆర్‌నగర్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మహా సంకల్ప విశ్వశాంతి గాయత్రీ మహాయజ్ఞం ఏర్పాట్లను శనివారం ఆయన పర్యవేక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పట్టణ, పట్టణేతర ప్రముఖులంతా సమిష్టిగా నిర్వహిస్తున్న గాయత్రీ మహాయజ్ఞంలో తానుకూడా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. 1296 మంది దంపతులు 108 అగ్ని హోత్రాలతో గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సుమారు 25వేల మంది భక్తులు ఈ యజ్ఞంలో పాలుపంచుకోవడం విశేషమన్నారు. సమావేశంలో పెన్మెత్స వెంకట సూర్యనారాయణరాజు (డీటీడీసీ బాబు), ఎంఎస్ వాసు, రేపూరి సూర్యనారాయణ, బాలి ఏడుకొండలు, నంబూరి శ్రీనివాసరావు, మద్దింశెట్టి రమేష్, మాటూరి వాసుదేవగుప్త, కేవీఆర్‌కే మోహన్, గాదె బాబు, బీహెచ్ సుబ్బరాజు, మాజేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లబ్ధిదారులు వేగంగా గృహ నిర్మాణాలు చేపట్టాలి


ఆగర్తిపాలెంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పెదపాటి పెద్దిరాజు

పాలకొల్లు అర్బన్: ఇంటి స్థలాల పట్టాలు పొంది, గృహ నిర్మాణ శాఖ ద్వారా రుణాలు మంజూరైన లబ్ధిదారులు త్వరగా గృహాలు నిర్మించుకోవాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు కోరారు. పాలకొల్లు మండలం ఆగర్తిపాలెం జగనన్న లే అవుట్ లబ్ధిదారులతో శనివారం గ్రామ సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పెద్దిరాజు మాట్లాడారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తోందని, దీంతో పాటు డ్వాక్రా రుణంగా రూ.35 వేలు అందిస్తున్నారన్నారు. మండల ప్రత్యేకాధికారి అప్పారావు, సర్పంచ్ గూడూరి శేషవేణి, వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇళ్ళ నిర్మాణాలు చేపట్టని వారికి నోటీసులు జారీ చేయాలి

మొగల్తూరు: పట్టాలిచ్చి మూడు సంవత్సరాలుదాటినా ఇంటి నిర్మాణాలు చేపట్టని వారికి నోటీసులు జారీ చేయాలని మండల ప్రత్యేకాధికారిణి వి విజయలక్ష్మి వీఆర్‌వోలను ఆదేశించారు. శనివారం హౌసింగ్‌డే సందర్భంగా మండలంలోని కెపిపాలెం నార్త్‌లోని పోతాబత్తులవారి మెరకలో చేపట్టిన ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆప్షన్-3 ద్వారా కాంట్రాక్టర్‌తో గృహ నిర్మాణాలు చేపట్టిన వారికి స్త్రీ నిధి రూ.35 వేలు రుణం మంజూరయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్‌ను, నిర్మాణాలు చేపట్టిన గృహాలను జియో ట్యాగ్ చేసి త్వరతగతిన బిల్లులను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద్ కుమార్, ఏపీవో శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ ఫణీంద్ర పాల్గొన్నారు.

వీఆర్‌కు పాలకొల్లు పట్టణ సీఐ

పాలకొల్లు సెంట్రల్: పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ అఖిల్ జామాను వీఆర్‌కు పంపుతూ శుక్రవారం రాత్రి పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నరసాపురం పట్టణ సీఐకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

కోవెలలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు


హైకోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌కు వేద ఆశీర్వచనం అందిస్తున్న పండితులు

నరసాపురం: పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ ఆదికేశ వెంబేరుమానార్‌స్వామి దేవస్థానం(కోవెల)ను శనివారం హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో న్యాయమూర్తికి స్వాగతం చెప్పారు. ఆలయ వేద పండితుడు ఎస్.శేషాచార్యులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పి.ఆదినారాయణ ఉన్నారు.

దాళ్వాకు సమృద్ధిగా సాగునీరు


మేడపాడులో రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఏఈ సల్లపూడి శ్రీనివాస్

యలమంచిలి: దాళ్వా పంటకు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ ఏఈ సల్లపూడి శ్రీనివాస్ చెప్పారు. చించినాడ కాల్వ ఆయకట్టు పరిధిలోని పెనుమర్రు, కట్టుపాలెం, మేడపాడు, శిరగాలపల్లి గ్రామాల రైతులతో శనివారం మేడపాడు డ్వాక్రా భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు సాగునీరు సక్రమంగా రావడంతో రైతులంతా నారుమడి, ఊడ్పులు సమర్థంగా పూర్తి చేశారన్నారు. చించినాడ కాల్వకు ఈ నెల 3వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి వంతుల వారీ విధానం అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ వంతు 9వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు మొదటి వంతు ఉంటుందన్నారు. ఈ విధంగా మార్చి నెలాఖరు వరకు వంతుల వారీ విధానం అమలు చేస్తున్నట్లు వివరించారు. రెండవ వంతు ఫిబ్రవరి 16 నుంచి 22 వరకూ, మూడో వంతు మార్చి ఒకటి నుంచి ఏడో తేదీ వరకు, నాలుగో వంతు మార్చి 14 నుంచి 20వ తేదీ వరకు, చివరి ఐదవ వంతు మార్చి 27 నుంచి ఏప్రిల్ 2 వరకు అమలు చేస్తామన్నారు. రైతులంతా సహకరించి ఈ విధానం సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. కాలువ కింద రైతులకు వంతు వెళ్తున్న సమయంలో పై రైతులు అడ్డుకట్టలు వేయవద్దని కోరారు. కార్యక్రమంలో పెనుమర్రు సర్పంచ్ కవురు గోపి, మేడపాడు సొసైటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ రైతులు గంధం సత్యకీర్తి, వెలెచేటి వెంకట్రావు, గొడవర్తి సత్యనారాయణ, జెట్టి వీరభద్రరావు మండల వ్యవసాయ అధికారి చిందులూరి దేవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఫైర్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో మంచి విద్యాబోధన అందుతుందని విద్యా శాఖ మండల కోఆర్డినేటర్ తోకల జనార్ధన్ అన్నారు. శనివారం స్థానిక జీపీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ఫైర్ ప్రొటెక్షన్ ఎక్విప్మెంట్ సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ నాడు-నేడు మొదటి విడతలో 29 పాఠశాలలకు మంటలను అదుపులోకి తీసుకువచ్చే ఫైర్ ప్రొటెక్షన్ ఎక్విప్మెంట్ సామాగ్రిని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, సీఆర్‌పీ శ్రీనివాస్, రామకృష్ణ, లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామ కల్యాణం

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఉల్లంపర్రు ఏఎస్ఆర్ నగర్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించనున్న గాయత్రీ మహాయజ్ఞంలో భాగంగా శనివారం శ్రీ సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చక స్వాములు సూగూరు రాజేశ్వరరావు, యోగానందం శివ సుబ్రహ్మణ్యం దంపతుల బ్రహ్మత్వంలో యామ వీరేష్-విజయ దంపతులు, అద్దేపల్లి విశ్వనాథం, అద్దేపల్లి శ్రీరామారావు దంపతుల సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆధ్యాత్మిక ప్రవచనకర్త సుదురుపాటి సీతాపతి సీతారాముల కల్యాణ వైభవం పై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

7న వాహనాల వేలం

ఆకివీడు: స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 7న రెండు టీవీఎస్ మోపెడ్స్ వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రామారావు శనివారం చెప్పారు. ఎస్ఈబీ విజయవాడ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల్ని వేలం వేస్తున్నామన్నారు. వేలంలో పాల్గొనే వారు డిపాజిట్ చెల్లించాలని సూచించారు. అధిక ధరకు పాడుకున్న వారికి వాహనం అందజేస్తామని, వెంటనే పాట సొమ్ము చెల్లించాలని ఆయన పేర్కొన్నారు.

మెస్ చార్జీలను పెంచాలని నిరసన

సాక్షి, భీమవరం: నిత్యావసర సరకులు మార్కెట్ ధరలకు అనుగుణంగా హాస్టల్స్ మెస్ చార్జీలను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పోలీస్ బొమ్మ సెంటర్ వద్ద భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఖాళీ కంచాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్, జి.శ్రీను, గణేష్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాగాయత్రీ శోభాయాత్ర


శోభాయాత్రలో కలశాలతో మహిళలు


గాయత్రి అమ్మవారికి కలశ పూజ చేస్తున్న గురూజీ

పాలకొల్లు సెంట్రల్: దేశాన్ని తద్వారా విశ్వాన్ని శక్తివంతం చేయించెడి ఒక వైజ్ఞానిక, ఆధ్యాత్మిక ప్రయోగమని సకరాత్మా ఫౌండేషన్ సంకల్ప సమాధియోగ ఫౌండర్ సత్య సేవక్ ప్రేమ్ నిరంతర్ గురూజీ (నాన్న) అన్నారు. ఆదివారం జరగనున్న మహాసంకల్ప విశ్వశాంతి గాయత్రీ మహాయజ్ఞం నిర్వహణలో భాగంగా శనివారం పట్టణంలో శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం నుంచి కటకం హరి ప్రవీణ్ శర్మ బృందంతో మహాగాయత్రి అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ ఈ మూడు విధాలైన యజ్ఞాలు అనగా నరమేథం, సర్వమేథం, గోయజ్ఞాల పరిపూర్ణ కలయికే ఈ మహా సంకల్ప గాయత్రీ యజ్ఞమని అన్నారు. ఈ యాత్రలో 108 కలశాలు, ముత్తయిదువులతో జ్యోతులు, మేళతాళాలు, కోలాటం, దాండియాలతో రథంపై గాయత్రీ అమ్మవారిని పట్టణ పురవీధుల్లో ఊరేగించి గాయత్రి మహాయజ్ఞం నిర్వహించే ఉల్లంపర్రు ఏఎస్ఆర్ రైస్‌మిల్లు వద్దకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి జరగనున్న మహాయజ్ఞంలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు అనంతరం అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించాలన్నారు.


దీపాలతో వెళ్తున్న యువతులు, మహిళలు